పదింతల శ్రద్ధ

ప్రతి విద్యార్థికి టెన్త్ పరీక్షలు కీలకం. భవిష్యత్తు బంగారుబాటలో నడవాలంటే పదవ తరగతిలో ప్రతి విద్యార్థి తన ప్రతిభను నిరూపించుకోవాల్సిందే. కష్టపడి ప్రణాళికాబద్ధంగా చదివితే ఉత్తమ మార్కులు సాధించడం నల్లేరు మీద నడకే అంటున్నారు నిపుణులు. శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా కమిషన్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశాలతో ప్రభుత్వ పాఠశాలల్లో వంద రోజుల ప్రణాళికను డిసెంబరు ఒకటో తేదీ నుంచి అమలు చేస్తున్నారు. దీనిలో భాగంగా పదవ తరగతి విద్యార్థులకు అదనపు తరగతులతో పాటు, పలు మార్గదర్శకాలను కమిషన్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ విడుదల చేసింది. మార్చి 17 నుంచి 31వ తేదీ వరకు పదవ తరగతి ఫైనల్ పరీక్షలు జరగనుండటంతో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు వంద రోజుల ప్రణాళికను పటిష్టంగా అమలు చేస్తున్నారు. దాబాగార్డెన్స్‌లో గల మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్ నుంచి పదవ తరగతి పరీక్షలకు 113 మంది హాజరవుతున్నారు. ఇంగ్లీష్ మీడియం నుంచి 46 మంది బాలికలు, 67 మంది బాలురు పరీక్షలు రాస్తున్నారు. రైల్వే హైస్కూల్ నుంచి 87 మంది ఇంగ్లీష్ మీడియంలో హాజరవుతుండగా వారిలో 61 మంది బాలురు, 26 మంది బాలికలు ఉన్నారు.





ఎంజీఎం హైస్కూల్

విద్యార్థుల దత్తత..

పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులంతా ప్రతి ఒక్కరూ ఆరుగురి నుంచి 8 మంది టెన్త్ విద్యార్థులను దత్తత తీసుకున్నారు. ఈ విద్యార్థుల చదువు ఎలా సాగుతోంది.. ఏ సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్నారు.. వారిలో భయాన్ని పోగొట్టి ఆత్మవిశ్వాసం నింపేలా కృషి చెయ్యాల్సి ఉంది. దత్తత తీసుకున్న విద్యార్థులు రోజూ బడికి వస్తున్నారా.. మార్కులు ఎలా వస్తున్నాయి.. రోజూ పరీక్షలు నిర్వహించడం.. సందేహాల నివృత్తి, వెనుకబడిన సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి.. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి ఫైనల్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా వారిని సన్నద్ధం చెయ్యాలి.



ఎంజీఎం హైస్కూల్‌లో తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

- టెన్త్‌లో ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా విద్యార్థులకు బోధన
- ఉదయం, సాయంత్రం అదనపు తరగతులు
- శతశాతం ఉత్తీర్ణతకు వంద రోజుల ప్రణాళిక అమలు
- సెలవు రోజుల్లో కూడా క్లాసుల నిర్వహణ

ఇంగ్లిష్‌లో తర్ఫీదు ఇచ్చాం..



ఇంగ్లిష్‌లో విద్యార్థులు పట్టు సాధించేలా కృషి చేశాం. ఇంగ్లిష్ మీడియం కావటంతో విద్యార్థులకు లాంగ్వేజెస్‌పై పూర్తిగా అవగాహన ఉంది. ఇంగ్లిష్ సబ్జెక్టులో మంచి మార్కులు సాధిస్తాం. అదే విధంగా మిగిలిన సబ్జెక్టుల్లో కూడా మంచి మార్కులు వస్తాయి. శతశాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేశాం.
-వి.సునీత, ఇంగ్లీషు టీచర్

సబ్జెక్టులపై పట్టు సాధించారు..



విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో సబ్జెక్టులపై పట్టు సాధించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం. ప్రతి రోజు రెండు పూటలా దగ్గరుండి రివిజన్ చేయిస్తున్నాం. ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తుండడం వల్ల ఈసారి మంచి ఫలితాలు సాధిస్తాం అనే నమ్మకం కలుగుతోంది.
- బి.సునీత, పీఎస్ టీచర్

అల్లిపురం: పది పరీక్షల కోసం విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలి. చదివేందుకు అనేక ఇబ్బందులు ఎదురవుతుంటాయి. పరీక్షలు రాయటం అనేది చాలా చిన్న విషయం అనేది విద్యార్థులు గుర్తుంచుకోవాలి. ఉదయం 5 నుండి 8 గంటల వరకు, సాయంత్రం 7 నుండి 10 గంటల వరకు చదువుకు కేటాయించుకోవాలి. మధ్యాహ్నం డ్రాయింగ్ వేయటం, అబ్జెక్టివ్ ప్రశ్నలు, వ్యాకరణం ప్రాక్టీస్ చేయడం వల్ల పాఠాలు సులభంగా అర్థమవుతాయి.

అదనపు తరగతులు..

వంద రోజుల ప్రణాళికలో భాగంగా ప్రతి రోజూ ఉదయం 8 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. సాధారణ పని వేళల కంటే ఉదయం ఒక గంట, సాయంత్రం ఒక గంటన్నర అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం ఒక సబ్జెక్టు, సాయంత్రం మరొక సబ్జెక్టు చదివిస్తున్నారు. అలాగే సెలవు రోజుల్లో కూడా టెన్త్ విద్యార్థులకు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం ఒక సబ్జెక్టు, మధ్యాహ్నం మరొక సబ్జెక్టు చదివిస్తున్నారు.

ఉపాధ్యాయుల గైడెన్స్ బాగుంది..



ప్రతి విద్యార్థి పదవ తరగతిలో మంచి మార్కులు సాధించేలా ఉపాధ్యాయులు గైడ్ చేస్తున్నారు. రోజూ అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. వెనుక బడిన సబ్జెక్టుల్లో మంచి మార్కులు సాధించేలా ఉపాధ్యాయులు సూచనలు, సలహాలు ఇస్తున్నారు.
-ఒ. చాందిని, టెన్త్ విద్యార్థి, ఎంజీఎం హైస్కూల్

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ..



క్లాసులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నాం. బాగా చదువుతున్న వారితో వారికి శిక్షణ ఇస్తున్నాం. డీఈవో ఆదేశాల మేరకు కార్యాచరణ పక్కాగా అమలు చేస్తున్నాం. శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు విద్యార్థులకు అనువైన స్టడీ మెటీరియల్ సిద్ధం చేశాం. ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తూ విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేస్తున్నాం. - కె.రాంబాబు, మ్యాథ్స్ ఇన్‌చార్జి, ఎంజీఎం హై స్కూల్

విద్యార్థుల స్థాయిని బట్టి బోధన..



జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాలతో శతశాతం ఉత్తీర్ణత కోసం వంద రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నాం. 113 మంది టెన్త్ చదువుతున్నారు. ఒక్కో ఉపాధ్యాయుడు ఆరుగురు విద్యార్థులను దత్తత చేసుకుని చదివిస్తున్నారు. ఎఫ్ఏ-1, ఎఫ్ఏ-2లో వచ్చిన మార్కుల ఆధారంగా ఏ,బీ,సీ,డీ గ్రేడ్లుగా విద్యార్థులను విభజించి స్టడీ మెటీరియల్ సిద్ధం చేశాం.
- ఆర్‌వీవీఎస్ నాగభూషణం, ప్రధానోపాధ్యాయులు, ఎంజీఎం హైస్కూల్

క్లుప్తంగా

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం: జ్ఞానాపురం కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక దర్శనాలు కల్పించారు. భక్తుల మౌలిక వసతులపై ఈవో సురేష్‌బాబా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆలయ సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, కమిటీ సభ్యులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

'కౌన్సిల్ నియామకాల్లో ఎస్సీలకు అన్యాయం'

అల్లిపురం: జీవీఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ నియామకం నిమిత్తం ఇటీవల రిలీజ్ చేసిన నోటిఫికేషన్‌లో ఎస్సీలకు అన్యాయం జరిగిందని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధికార ప్రతినిధి పాకా సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే నోటిఫికేషన్ రద్దు చేసి కొత్తగా నోటిఫికేషన్ విడుదల చేయాలని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జీవీఎంసీ కమిషనర్, రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీలను చులకనభావంతో చూస్తున్నట్లు ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

పేదలకు క్రిస్మస్ కానుకల అందజేత



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న సంజీవరావు, విజయలక్ష్మి

కంచరపాలెం: జ్ఞానాపురం పరిధి మాస్యువల్ స్ట్రీట్‌లో వంక సంజీవరావు, విజయలక్ష్మి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం పేదల క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సెయింట్ పీటర్స్ కెథడ్రిల్ చర్చి ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ క్రిస్మస్ సందేశం అందించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి పేదలకు చీరలు, రగ్గులు అందజేశారు. కార్యక్రమంలో కె. భానోజీరావు, ఉప్పుల మరియదాస్, బేతా కృపానంద, జోసెఫ్, బేతా లూర్దురాణి, బోగ బుల్లి, మధుబాబు, రవిబాబు, శేఖర్ రావు, సునీత తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి మార్గశిర పూజలు



ప్రత్యేక అలంకరణలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాల 21వ రోజు ఆదివారం కనకమహాలక్ష్మి అమ్మవారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. ఉదయం 5 నుంచి పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం, ప్రత్యేక హోమాలు, సహస్రనామార్చన, సర్వదర్శనం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో, తులసీదళార్చనలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, వేద పండితులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

జగదాంబ జంక్షన్‌కు క్రిస్మస్ తాకిడి

ఎక్కడికక్కడ ట్రాఫిక్ జామ్



కిక్కిరిసిన జగదాంబ జంక్షన్

దాబాగార్డెన్స్: క్రిస్మస్ పండగను పురస్కరించుకుని నగరం నుంచే కాక జిల్లా నలుమూలల నుంచి వస్త్రాలు కొనుగోలు చేసేందుకు జనం పెద్ద ఎత్తున తరలి రావడంతో జగదాంబ జంక్షన్ క్రిస్మస్ శోభ సంతరించుకుంది. ఆదివారం కొనుగోలుదారులు పెద్ద ఎత్తున వస్త్ర దుకాణాలకు క్యూ కట్టారు. జగదాంబ జంక్షన్‌లో గల పలు వస్త్ర దుకాణాలు ఆఫర్లు ప్రకటించడంతో పెద్ద ఎత్తున వస్త్రాలు కొనుగోలు చేస్తూ కనిపించారు.

ఫుట్‌పాత్ మార్కెట్‌కు గిరాకీ..

క్రిస్మస్ పండగ ఫుట్‌పాత్ మార్కెట్‌కు గిరాకీ తెచ్చిపెట్టింది. అధిక సంఖ్యలో కొనుగోలు దారులు జగదాంబ జంక్షన్‌కు రావడంతో పెద్ద షాపింగ్ మాల్స్‌తో పాటు ఫుట్‌పాత్ మార్కెట్ కూడా బాగానే సాగుతోంది.

దాబాగార్డెన్స్‌లో కూడా..

దాబాగార్డెన్స్ మెయిన్‌రోడ్డులో గల పలు వస్త్ర దుకాణాలకు కూడా కొనుగోలు దారులు క్యూకట్టారు. ఓ వైపు సెల్ దుకాణాలు.. మరోవైపు వస్త్ర దుకాణాలకు జనం క్యూ కట్టడంతో దాబాగార్డెన్స్ మెయిన్‌రోడ్డుతో పాటు పలు ప్రాంతాలు కిటకిటలాడాయి. అలాగే జగదాంబ చుట్టు పక్కల ప్రాంతాలైన టర్నర్‌చౌల్ట్రీ, పూర్ణామార్కెట్, మసీదు జంక్షన్, ఎల్లమ్మతోట, కేజీహెచ్ అప్‌రోడ్డు, దేవరవీధి, లేపాక్షి జంక్షన్, ప్రకాశరావుపేట జంక్షన్ తదితర ప్రాంతాలన్నీ ద్విచక్ర వాహనాలు, కార్ల పార్కింగ్‌తో నిండిపోయాయి.

రక్షణగిరిలో దీపారాధన



దీపారాధనలో పాల్గొన్న మహిళలు

కంచరపాలెం: జ్ఞానాపురం పునీత పేతురు చర్చి ఫాదర్ రెవరెండ్ జొన్నాడ జాన్‌ప్రకాష్, పారిస్ పాస్టిల్ కౌనిల్స్ (పీపీసీ) సంయుక్త ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకల్లో భాగంగా ఆదివారం ఉదయం 4 గంటలకు కొవ్వొత్తులతో జ్ఞానాపురం వీధుల్లో ప్రదక్షిణలు చేశారు. సెబాస్టియన్ కాలనీ, బాబూ కాలనీ, జేఎస్ఎస్‌యూఆర్‌ఎం కాలనీల్లో మహిళలు కొవ్వొత్తులతో ప్రదర్శనలు నిర్వహించారు. క్రీస్తు రాకకోసం ప్రజలు భక్తి శ్రద్ధలతో మెలగాలన్నారు. నవ దినాలు జరిగే దీపారాధనల్లో అన్ని గ్రామాల భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పీపీసీ సభ్యులు, అధిక సంఖ్యలో క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.

నిరంతర సాధనతోనే విజయం



మహిళలపై జరుగుతున్న దాడులపై స్కిట్

దాబాగార్డెన్స్: విశాఖపట్నం బ్రాంచ్ ఆఫ్ ది సదరన్ ఇండియా రీజనల్ కౌన్సిల్ (ఎస్ఐఆర్‌సీ) ఆఫ్ ఐసీఏఐ ఆధ్వర్యంలో ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా నిర్వహించిన 'లుడిపాస్ సికాసా స్టూడెంట్స్ ఫెస్ట్-2024' అలరించింది. నగరానికి చెందిన చార్టెర్డ్ అకౌంటెంట్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బ్రాంచ్ చైర్మన్ సీఏ అనిర్బన్ పాల్‌తో పాటు సికాసా చైర్మన్ సీఏ పి. లోకేష్ తదితరులు విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. భవిష్యత్‌లో తీసుకోవల్సిన నిర్ణయాలు, రాణించాల్సిన అంశాలపై ఉత్తేజపరిచారు. నిరంతర సాధనతోనే అది సాధ్యమవుతుందని చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విజయాలు సాధించిన విద్యార్థుల మనోభావాలు ఈ ఫెస్ట్ ద్వారా ఇతరుల్లో స్ఫూర్తిని నింపాయి. సికాసా గవర్నెన్స్ హెడ్ సీఏ డి. ఉజ్వల చేపట్టిన స్కిట్ ఆకట్టుకుంది. మహిళలు, విద్యార్థినులపై జరుగుతున్న దాడులపై అందరిలోనూ అవగాహన కల్పించేలా ఈ ప్రదర్శన ఉందని నిర్వాహకులు కొనియాడారు. సికాసా మేనేజింగ్ కమిటీ సభ్యుల పర్యవేక్షణలో సీఏ అనిర్బన్‌పాల్, విద్యార్థి విభాగం చైర్మన్ సీఏ పి. లోకేష్, సీఏ ఉజ్వల, కోశాధికారి బి. డిరపుల్ స్నేహిత, కె. పుష్పక్, సంపత్, ఇషిక తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను గౌరవించిన పార్టీ బీజేపీ



నిరసన తెలుపుతున్న బీజేపీ ఎస్సీ మోర్చా నాయకులు

దాబాగార్డెన్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను ఎంతగానో గౌరవించిన పార్టీ బీజేపీ అని ఆ పార్టీ పార్వతీపురం జిల్లా ఇన్‌చార్జి ఎస్సీఎస్ ప్రకాష్‌రెడ్డి అన్నారు. దేశవ్యాప్తంగా బీజేపీ నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఎల్ఐసీ కూడలిలో గల అంబేడ్కర్ విగ్రహానికి బీజేపీ ఎస్సీ మోర్చా నేతృత్వంలో నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ చర్యలను వ్యతిరేకిస్తూ దిష్టిబొమ్మకు చెప్పుల దండ వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ అంబేడ్కర్‌ను కాంగ్రెస్ పార్టీ కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుందని విమర్శించారు. గత 60 ఏళ్లలో కాంగ్రెస్ పార్టీ అంబేడ్కర్‌ను ఏ రీతిన గుర్తించలేదన్నారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా నాయకులు రాకేష్‌చంద్ర, చొక్కాకుల రాంబాబు, శ్రీరంగం దానేష్, రూపాకుల రవికుమార్, ధోని నాగరాజు, ఉమ్మడి సుజాత, షేక్ నూర్‌బాషా, సుశీల, బాబీ తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి సన్నిధిలో వేదసభ, అర్చక సదస్సు



వేదసభ, అర్చక సదస్సులో వేదపండితులు, అర్చకులు

దాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాల సందర్భంగా కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఆదివారం సాయంత్రం 6.30 నుంచి 8.30 గంటల వరకు వేదసభ, అర్చక సదస్సు నిర్వహించారు. సదస్సులో 20 మంది వేదపండితులు, 21 మంది అర్చకులతో పాటు దేవస్థాన వేదపండితులు ముష్టి భీమా శంకరశాస్త్రి, ముష్టి వెంకటేశ్వర ఘనపాఠి, చావలి లక్ష్మీనారాయణ అవధానులు, కోట పంచముఖి శర్మ, ప్రధాన అర్చకుడు కొడమంచలి శ్రీనివాసశర్మ, ముఖ్య అర్చకుడు బీఎస్ఎస్ భట్టర్ పాల్గొన్నారు. వేదసభను ముందుగా ఆలయ ఈవో కె. శోభారాణి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా చతుర్వేదాల విశిష్టత, వైఖానస, స్మార్తం, శైవాగమం, పాంచరాత్రం ఆగమాల గురించి వివరించారు.

26న దర్శనాల నిలిపివేత

ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 26న సహస్రఘటాభిషేకం నిర్వహించనున్నారు. ఆ రోజు సాయంత్రం 4 గంటల నుంచి నిర్వహించనున్న సహస్రఘటాభిషేకం సందర్భంగా మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 7 గంటల వరకు దర్శనాలు నిలిపివేయనున్నారు. అలాగే సాయంత్రం 6 గంటలకు నిర్వహించే పంచామృతాభిషేకం సేవా టికెట్లు సహస్ర ఘటాభిషేకం సందర్భంగా రద్దు చేయడమైందని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు.

కేజీహెచ్‌లో తాగుబోతుల వీరంగం

- ఆక్సిజన్ ట్యాంక్ పైపు కట్ చేసేందుకు ప్రయత్నం
- ముగ్గురిని పోలీసులకు అప్పగించిన సెక్యూరిటీ

మహారాణిపేట: కేజీహెచ్‌లో తాగుబోతులు వీరంగం సృష్టిస్తున్నారు. సిబ్బందికి సంబంధించిన కొందరు వ్యక్తులు అనధికారికంగా విధులు నిర్వర్తిస్తూ రోగులను, వారి బంధువులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. శనివారం రాత్రి ముగ్గురు వ్యక్తులు మద్యం సేవించి ఆక్సిజన్ ట్యాంక్ పైపులను కత్తిరించడానికి ప్రయత్నించారు. ఇది గమనించిన సెక్యూరిటీ సిబ్బంది వారిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై విచారణ చేపడుతున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. ఒకవేళ పైపులు కట్ చేసి ఉంటే ఆస్పత్రికి ఆక్సిజన్ సరఫరా నిలిచిపోయేది. అంతేకాకుండా వీరు రోగులు, వారి బంధువుల నుంచి పర్సులు, సెల్‌ఫోన్లు, ఆభరణాలతో పాటు ఆస్పత్రి ఆస్తులను కూడా దొంగిలిస్తున్నారు. పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాల టైర్లు, ఇతర పరికరాలను చోరీ చేస్తున్నారు. బైక్‌లను కూడా దొంగలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులు కానీ, కేజీహెచ్ అధికారులు కానీ పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి.

ఘనంగా శారదా మాత జయంతి



శారదా మాత జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

దాబాగార్డెన్స్: దివ్య జనని శారదా మాత జయంతిని ఆదివారం స్వామి వివేకానంద సంస్థలో నిర్వహించారు. 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు పాల్గొని మాత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భగవాన్ రామకృష్ణ పరమహంస సతీమణి, సాక్షాత్తు కాళీమాతనే దర్శించుకున్న దివ్య జనని శారద మాతను ఎప్పుడూ కాళికాదేవి స్వరూపంగా పూజించేవారన్నారు. శారదా దేవి రామకృష్ణ పరమహంస బోధనలు భావితరాలకు అందివ్వడంలో రామకృష్ణ మఠం, రామకృష్ణ మిషన్లు విస్తరింపజేయడంలో ముఖ్య పాత్ర పోషించారన్నారు. రామకృష్ణ పరమహంస ప్రియ శిష్యుడు స్వామి వివేకానంద ఆధ్యాత్మిక బోధనలు విస్తరింపజేశారని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, ట్యూషన్ పిల్లలు పాల్గొన్నారు.

శ్రీనివాస రామానుజన్ స్ఫూర్తితో నూతన ఆవిష్కరణలు



బహుమతులతో విద్యార్థినులు

దాబాగార్డెన్స్: గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా నేషనల్ మ్యాథమెటిక్స్ డేని ఆదివారం మహిళా కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల మాట్లాడుతూ జీవితంలో ఏం సాధించాలనుకున్నామో ముందుగానే టార్గెట్ పెట్టుకుని శక్తి వంచన లేకుండా కృషి చేయాలన్నారు. గణితశాస్త్ర విభాగాధిపతి కేవీఎస్ నాగలక్ష్మి మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్‌ని ఆదర్శంగా తీసుకుని గణిత శాస్త్రంలో కొత్త ఆవిష్కరణలు చేయడానికి కృషి చేయాలన్నారు. ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ సంతోషి అనూష మాట్లాడుతూ కమ్యూనికేషన్ స్కిల్స్‌ను విద్యార్థినులందరూ అలవరచుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు నిర్వహించిన క్విజ్, వక్తృత్వ, పవర్ పాయింట్ ప్రజంటేషన్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గణితశాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ కేవీ ప్రసన్న ఇతర అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన మానసిక రోగి ఆచూకీ లభ్యం



మానసిక ఆసుపత్రికి చేరుకున్న సుబ్రహ్మణ్యం

దాబాగార్డెన్స్: మానసిక వ్యాధికి గురై తప్పిపోయిన రోగిని వన్‌టౌన్ పోలీసులు గుర్తించారు. వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తూర్పు గోదావరి జిల్లా కాకినాడకు చెందిన సుబ్రహ్మణ్యం మానసిక పరిస్థితి బాగు లేనందున తల్లిదండ్రులు సత్యారావు, వరలక్ష్మి శనివారం విశాఖలో గల మానసిక ఆస్పత్రికి తీసుకొచ్చారు. వారు వైద్యుడితో మాట్లాడుతున్న సమయంలో అక్కడి నుంచి తప్పించుకుని సుబ్రహ్మణ్యం పారిపోయాడు. అతని కోసం తల్లిదండ్రులు రోజంతా గాలించారు. ఆచూకీ తెలియక తిరిగి కాకినాడ వెళ్లిపోయారు. శనివారం అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో పాతనగరం చెంగల్రావుపేట మసీదు సమీపాన అనుమానాస్పదంగా సుబ్రహ్మణ్యం తిరుగుతుంటే స్థానికులు పట్టుకుని వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు రెడ్‌క్రాస్ సంస్థకు సమాచారమిచ్చారు. రెడ్‌క్రాస్ సిబ్బంది అక్కడికి చేరుకుని మతిస్థిమితం లేని సుబ్రహ్మణ్యం వద్ద ఉన్న ఫోన్ ద్వారా తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి విశాఖ రప్పించారు. వన్‌టౌన్ సీఐ జి. దేముడుబాబు సమక్షంలో ఆ వ్యక్తిని మానసిక ఆస్పత్రికి తరలించారు.

ద్విచక్ర వాహనం నుంచి పొగ, మంటలు



అగ్ని ప్రమాదానికి గురైన ద్విచక్ర వాహనం

మహారాణిపేట: కేజీహెచ్ గైనిక్ వార్డు ఎదురుగా ఒక ద్విచక్ర వాహనం అగ్ని ప్రమాదానికి గురైంది. గైనిక్ వార్డులో ఉన్న రోగిని పరామర్శించడానికి వచ్చిన వారి బంధువు ఒకరు గైనిక్ వార్డు ఎదురుగా ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేశారు. తర్వాత రోగిని పరామర్శించి వచ్చిన అతను వాహనాన్ని స్టార్ట్ చేయడానికి ప్రయత్నించారు. తర్వాత కొద్ది సేపటికే ద్విచక్ర వాహనంలో పొగలు రావడంతో పాటు మంటలు చేలరేగాయి. దీంతో సమీపంలో ఉన్న కేజీహెచ్ సెక్యూరిటీ సిబ్బంది పౌడర్ చల్లి మంటలను అదుపు చేశారు. వెంటనే ఈ విషయాన్ని సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ దృష్టికి తీసుకెళ్లారు. ఆ తర్వాత పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు.

ఆస్పత్రి సిబ్బంది తీరుపై రోగి బంధువుల ఆగ్రహం



ఆస్పత్రిలో ఆందోళన చేస్తున్న రోగి బంధువులు

అల్లిపురం : ఓ ప్రైవేట్ ఆస్పత్రి సిబ్బంది మోట తీరు సరిగా లేదంటూ రోగి బంధువులు ఆదివారం సాయంత్రం ఆందోళనకు దిగారు. బుచ్చిరాజుపాలేనికి చెందిన పి.ఎల్లయ్య రైల్వేలో పనిచేసి రిటైర్ అయ్యారు. అనారోగ్యం కారణంగా రైల్వే ఆస్పత్రికి వెళ్లగా.. జగదాంబ దరి ఇండస్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఆస్పత్రిలో చేర్పించినప్పటి నుంచి వైద్యం అందించడం లేదంటూ రోగి బంధువులు సిబ్బందిని ప్రశ్నించారు. ఆస్పత్రి రిసెప్షన్ సిబ్బంది '78 సంవత్సరాల వ్యక్తి కదా.. చనిపోకపోతే ఏమవుతుంది' అనడంతో బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటప్పుడు వైద్యం అందించడం ఎందుకు.. డిశ్చార్జ్ చేసేయండని రోగి కుమార్తెలు పైడ కొండా, వెంకటలక్ష్మి సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. అయితే అతనికి వైద్యం అందిస్తున్నట్లు సిబ్బంది చెబుతున్నారు. ఈ గొడవపై ఆస్పత్రి సిబ్బంది మహారాణిపేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి రోగి బంధువులకు సర్ది చెప్పారు.

ఆకట్టుకున్న స్టోరీ టెల్లింగ్

సీతంపేట: ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన మియావాకీ స్టోరీ టైం చిన్నారులను విశేషంగా ఆకట్టుకుంది. ప్రముఖ సర్టిఫికెట్ కథకురాలు ఆర్.వరలక్ష్మి కథలు చెప్పి విద్యార్థులను ఉత్సాహపరిచారు. తుంటూ అనే పక్షి గురించి బెంగాలీ జానపద కథను, అలాగే కామిషిబాయి జపనీస్ కథ విధానంలో వాయిస్ మాడ్యులేషన్, హావభావాలతో బోధించి ఆకట్టుకున్నారు.